సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 18 । నవంబర్ । 2024



చలికాలం.. జరభద్రం

చలికాలం వచ్చేసింది. వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. -8లో



యువ ఉత్సవ్ విజేతలకు బహుమతులు

యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా యోగి వేమన విశ్వవిద్యాలయంలో పలు అంశాలపై నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.270

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 231 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రాయచోటి: ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 18వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పత్రికలకు అందజేసిన ప్రకటనలో ఈ విషయం పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆధార్‌తో హాజరవ్వాలి: ఎస్పీ

రాయచోటి: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి హాజరయ్యేవారు ఆధార్ కార్డుతో రావాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు.

నేడు పొలతలలో మల్లేశ్వరస్వామి కల్యాణం

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మూడో కార్తిక సోమవారం సందర్భంగా ఉదయం 10 గంటలకు మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ క్రిష్ణానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం స్వామివారి ఊరేగింపు అక్కదేవతల గుడి వరకు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. అలాగే మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో సోమవారం సిద్ధగురుస్వామి ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నటు నిర్వాహకులు తెలిపారు.

ఆగిన వర్షం

కడప అగ్రికల్చర్: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షం ఆదివారంతో ఆగింది. అయితే శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది.

నూతన కమిటీ

రాయచోటి అర్బన్: 108 సర్వీసు కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లాస్థాయి నూతన కమిటీ ఎంపిక ఆదివారం జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడుగా ఎస్.వి.రమణ, ప్రధాన కార్యదర్శిగా బి.వి.చలపతి, కోశాధికారిగా పి.యోగానందరెడ్డితో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజులు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంలో చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు.

ఖాకీపై ఖద్దరు స్వారీ!

- అధికార పార్టీ నేతలకు జీహుజూర్ అంటున్న ట్రిబుల్ స్టార్స్
- అక్రమ ఆదాయం కోసం అడ్డదారులు ఎంచుకున్న వైనం
- అక్రమార్జనకు నిలయంగా కడప, పులివెందుల సబ్ డివిజన్‌లు



సాక్షి ప్రతినిధి, కడప: రాష్ట్రంలో అధికారం మార్పిడి తర్వాత ఖాకీపై ఖద్దరు స్వారీ చేస్తోంది. కూటమి నేతలకు పోలీసులు జీహుజూర్ అంటున్నారు. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన రక్షకభటులు ఇలా వ్యవహరిస్తుండటం వివాదాస్పదంగా మారుతోంది. పోలీసులను ప్రజలు చట్టబద్ధంగా ఆశ్రయిస్తున్నా, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఇలాంటి సంఘటనలు జిల్లాలో పులివెందుల, కడప సబ్ డివిజన్‌లలో తెరపైకి వస్తున్నాయి. వేముల మండలం పెండ్లూరు సర్పంచ్ మహేశ్వరరెడ్డిపై హత్యాయత్నం ఘటన నేపథ్యంలో కేసు నమోదు చేయాల్సిందిగా కోరితే.. ఓ ట్రిబుల్ స్టార్ అధికారి 'కొన్నేళ్లుగా పోస్టింగ్ లేదు, మాజీ ఎమ్మెల్సీ ఇప్పించారు, ఆయన చెప్పినట్లే పని చేస్తాను' అని నిర్మోహమాటంగా చెప్పుకొచ్చి కేసు నీరుగార్చారు.

- అసాంఘిక కార్యకలాపాలకు అనుకూలంగా నిలిస్తే అధిక ఆదాయం లభిస్తోంది. జూదం, సెటిల్‌మెంట్లు, భార్యభర్తల పంచాయితీలు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని సస్పెండ్ అయిన బద్వేలుకు చెందిన ఓ కానిస్టేబుల్ నాగసుబ్బయ్య ఇటీవల సీఐ స్థాయి అధికారులు ఎంత పెద్ద అవినీతికి పాల్పడినా చర్యలుండవని వాపోతూ, వాయిస్ మెసేజ్ సోషల్ మీడియాలో పెట్టారు. అధికారుల మాటలు నమ్మి పోలీసు కానిస్టేబుళ్లు మోసపోవద్దని సూచించారు.
- పై రెండు ఘటనలు పోలీసు అధికారుల తీరుతెన్నులకు దర్పంగా నిలుస్తున్నాయి. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత చాటుకునే వారు కరువు అవుతున్నారా.. అధికారం, అక్రమార్జనకు బానిసలయ్యే అధికారులే అధికమయ్యారా... ఖద్దరు నేతలు ఆదేశిస్తే జీ.. హుజూర్ అంటూ తలాడిస్తూ చెప్పిందే తడువుగా ఖాకీలు పని చేస్తున్నారా.. అంటే అవుననే విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. చట్టానికి అనుగుణంగా అడుగులు వేసే నాలుగో సింహం కనిపించడం లేదు. రాజకీయ నాయకుల ప్రాపకం కోసం, ఆ మాటున అక్రమార్జన కోసం పరితపిస్తూ వ్యవస్థకు మచ్చ తెస్తూ కొంత మంది ట్రిబుల్‌స్టార్ అధికారుల చర్యలు ఉండిపోయాయి.

అక్రమాలకు నిలయంగా..

ఓ మాజీ ఎమ్మెల్సీ ఆదేశిస్తే న్యాయం, అన్యాయం చూడకుండా పులివెందుల సబ్ డివిజన్‌లో పోలీసు అధికారులు పని చేస్తున్నారనే ఆరోపణలు క్రమం తప్పకుండా తెరపైకి వస్తున్నాయి. ఎక్కడో హైదరాబాద్, విజయవాడల్లో నివసించే వారిపై కూడా పులివెందుల పోలీసులు అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. మరోవైపు టీడీపీ నేతలు స్వయంగా ఇళ్లకు వెళ్లి కొట్టుకుంటూ దౌర్జన్యంగా తీసుకెళ్లి నిర్బంధిస్తున్నా కేసులు నమోదు కావడం లేదు. ఇంకోవైపు ఎస్ఐ స్థాయి వారిని టీడీపీ నేతలు పరుషంగా దూషించినా సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అర్బన్, రూరల్ సర్కిల్ కార్యాలయాలు టీడీపీ నేతల అడ్డాగా మారిపోయాయి. మరోవైపు టీడీపీ వర్గీయులకు అనువైన ప్రాంతాల్లో జూదం విచ్చలవిడిగా కొనసాగుతోంది. వెరసి ఖాకీపై ఖద్దరు స్వారీ చేస్తోందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

ఇసుకపై కూటమి పెత్తనం

పాపాఘ్ని, పెన్నా నదులను ఇసుక అక్రమార్జనకు టీడీపీ వర్గీయులు ఎంచుకున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకరావడం వారికి వరంగా మారింది. అవసరం ఉన్న వారు అందుబాటులో ఉన్న ఆయా ప్రాంతాల్లో ఎక్కడైనా ఇసుకను తీసుకెళ్లవచ్చునని ప్రభుత్వం తేల్చి చెప్పింది. కాగా టీడీపీ నేతల అక్రమ వ్యవహారానికి పోలీసులు అడ్డుకట్ట వేయకపోగా, సామాన్యులు ఇసుకకు వెళితే ముప్పు తిప్పలు పెడుతున్నారు. కమలాపురం సర్కిల్‌లో పాపాఘ్నిలో ఇసుక తీసుకెళ్లేందుకు వీల్లేకుండా నదిలోకి వెళ్లే మార్గంలో కూటమి నేతలు గోతులు కొట్టించారు. ఫలానా చోటే ఇసుక తీసుకెళ్లాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి ప్రయోజనం కోసమే ట్రిబుల్‌స్టార్ అధికారి పని చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సామాన్యులకు అడ్డుగా నిలుస్తున్నారు. తద్వారా ఎవరి ప్రయోజనం వారికి దక్కుతున్నట్లు సమాచారం. కడప సబ్ డివిజన్‌లో అధికార పార్టీ నేతలు కనుసైగలు చేస్తే కొంత మంది పోలీసు అధికారులు రెచ్చిపోయి పని చేస్తున్న ఘటనలు తెరపైకి వస్తున్నాయి. ఈక్రమంలో రౌడీలను తలపిస్తూ లాఠీలు ఝళిపిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



వినాయకన్‌లా ఉన్న మాజిద్

వర్త్ ...వర్మా వర్త్



మనిషిని పోలిన మనుషులు ప్రపంచంలో ఏడుగురు ఉంటారని అంటుంటారు. ఆదివారం కడపలో హల్‌చల్ చేసిన ఓ వ్యక్తిని చూసినవారు ఇది నిజమేనని ఆశ్చర్యపోయారు. జైలర్ సినిమాలో వర్మ పేరుతో నటించిన వినాయకన్ విలన్ ఎంత పాపులర్ అయ్యాడో తెలిసిందే. అన్నమయ్య జిల్లా చిన్నమండెంకు చెందిన మాజిద్ అచ్చు వినాయకన్ లాగే కనిపించి హల్‌చల్ చేశాడు. బీడీలు తాగుతూ వర్మ వేషధారణలో హావభావాలు ప్రకటించాడు. దీంతో ప్రజలు అతని చుట్టూ చేరి జైలర్ సినిమాలోని పాపులర్ డైలాగ్ 'వర్త్.. వర్మా వర్త్' అంటూ కేరింతలు కొట్టారు.

– మహమ్మద్ రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప

ఉజ్వలం.. ఉరుసు ఉత్సవం

- వైభవోపేతంగా రెండో రోజు కార్యక్రమాలు
- పెద్ద దర్గాకు భారీగా తరలివచ్చిన భక్తజనం

కడప కల్చరల్: ప్రముఖ సూఫీ క్షేత్రమైన కడప అమీన్ పీర్ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా అరీఫుల్లా హుసేనీ సాహెబ్ గురువుల మజార్లపై గంధం సమర్పించారు. తొలుత దర్గా ముషాయిరా హాలులో ఇదారే అమీనియా వార్షిక నివేదిక సమర్పించారు. రాత్రి ఆషారే షరీఫ్‌లో భాగంగా గురువుల స్మారక వస్తువుల దర్శన కార్యక్రమం నిర్వహించారు. ఫకీర్ల విన్యాసాలు, బ్యాండు మేళాల మధ్య పీఠాధిపతి గంధం కలశాన్ని తమ ఇంటి నుంచి స్వయంగా ఊరేగింపుగా అట్టహాసంగా దర్గాకు తీసుకువచ్చారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసి పవిత్ర గ్రంథాన్ని దర్గా గురువుల మజార్ వద్ద సమర్పించారు. విశేష ప్రార్థనలు నిర్వహించి భక్తులందరికీ పాతెహా ప్రసాదాన్ని పంచిపెట్టారు. అలాగే కడప నగరం పెద్ద బజారుకు చెందిన వస్త్ర వ్యాపారులు పూల చాందినీతోపాటు వారి పక్షాన గంధాన్ని ఊరేగింపుగా బ్యాండ్ మేళాల మధ్య దర్గాకు చేర్చి గురువుల మజార్ల వద్ద చదివింపులు చేశారు. అనంతరం దేశంలోని ప్రముఖ గాయకులు తమ ఖవ్వాలీ గానంతో భక్తులను ఉర్రూతలూగించారు. వారు దర్గా గురువుల మహిమలు, పవిత్రత తదితర అంశాలపై సూఫీ కవితల ద్వారా గానం చేశారు.

అధికారుల చాదర్ సమర్పణ

ఉత్సవాలలో ప్రత్యేక కార్యక్రమంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంప్రదాయంగా చాదర్‌ను దర్గా ప్రతినిధులకు సమర్పించారు. కళాక్షేత్రం నుంచి వైవీ స్ట్రీట్ ద్వారా ఊరేగింపు చాదర్‌ను దర్గాకు చేర్చారు. దర్గా ప్రతినిధులు చాదర్‌ను సమర్పించిన కలెక్టర్‌కు సంప్రదాయంగా పేతా చుట్టి, కండువా అందజేసి, గురువుల మజార్‌ను దర్శింపజేసి ప్రార్థనలు చేయించారు.

మెరిసిన ప్రాంగణం

సాయంత్రం 6 గంటల నుంచి దర్గా ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. దర్గాలో ప్రార్థనలు చేసుకునేందుకు వచ్చిన వారితోపాటు బయటి ప్రాంతాల భక్తుల సందడి కనిపించింది. పలు రకాల దుకాణాలు, మహిళల కోసం ప్రత్యేకంగా షాపులు ఏర్పాటు చేయడంతో దర్గా ప్రాంగణం కొద్దిగా మారింది. దర్గా చుట్టుపక్కల హిందువుల దేవాలయాల వద్ద కూడా నిర్వాహకులు విద్యుత్ దీప అలంకరణ చేయడం విశేషం. పోలీసులు, జిల్లా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.



పూలచాదర్ తీసుకొస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

నేడు సినీ నటుడు రామచరణ్ రాక

ప్రముఖ సినీ నటుడు రామ్‌చరణ్‌తేజ్ సోమవారం కడప నగరానికి రానున్నారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆయన పెద్ద దర్గా దర్శనానికి విచ్చేయనున్నారు. ఏటా ముఖ్య అతిథి విచ్చేసి ప్రధాన ముషాయిరా (కవి సమ్మేళనం) కార్యక్రమంలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ సారి రామ్‌చరణ్ దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతోపాటు ఇతర నిర్ధారిత కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు దర్గా ప్రతినిధులు తెలియజేశారు.



పెద్ద దర్గా ఆవరణలో భక్తుల రద్దీ

ప్రతిభకు పట్టం

- కౌశల్-2024 పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అవకాశం
- రిజిస్ట్రేషన్‌కు నేడు ఆఖరు తేదీ

మదనపల్లె సిటీ: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలతో పాటు పోస్టర్ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. భారతీయ విజ్ఞాన మండలి (బీవీఎం), ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్) సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు ప్రకటన విడుదలైంది. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మూడు దశల్లో ఈ పోటీలను నిర్వహిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. రాష్ట్ర స్థాయి విజేతలు గవర్నర్‌ను కలిసి ఆయన చేతుల మీదుగా పురస్కారం అందుకుంటారు.

పాఠశాల స్థాయి స్క్రీనింగ్ పరీక్ష (ఆన్‌లైన్ క్విజ్)

పరీక్షల తేదీలు: నవంబర్ 20, 21, 22

అర్హులు: 8, 9, 10 తరగతుల విద్యార్థులు

సిలబస్: మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, సైన్సు పట్ల భారతీయుల కృషి (బహుళైచ్ఛిక ప్రశ్నలు)

రిజిస్ట్రేషన్ గడువు తేదీ: నవంబర్ 18

జిల్లా స్థాయి స్క్రీనింగ్ పరీక్ష (ఆన్‌లైన్ క్విజ్) తేదీ : డిసెంబర్ 6

అర్హులు: పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మొదటి 20 స్థానాలు పొందిన విద్యార్థులు

సిలబస్: మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, సైన్సు పట్ల భారతీయుల కృషి (బహుళైచ్ఛిక ప్రశ్నలు)

రాష్ట్ర స్థాయి పరీక్ష (క్విజ్) తేదీ: డిసెంబర్ 29, 30

వేదిక: స్కూల్ ఆఫ్ ప్లానింగ్, విజయవాడ

అర్హులు: జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులు

పోస్టర్-1: జిల్లా స్థాయిలో గెలుపొందిన 8వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు పోస్టరును తయారు చేసి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించాలి.

అంశం: రీసైక్లింగ్ ఆఫ్ వేస్ట్ మెటీరియల్ (లేదా) బయోడైవర్సిటీ అండ్ సాయిల్ హెల్త్



పోస్టర్ ప్రెజెంటేషన్ చేస్తున్న బసినికొండ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి (ఫైల్ ఫొటో)

పోస్టర్-2: జిల్లా స్థాయిలో గెలుపొందిన 9వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు పోస్టరును తయారు చేసి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించాలి.

అంశం: సర్ సీవీ రామన్ లైఫ్ అండ్ కాంట్రిబ్యూషన్స్ (లేదా) ఇండియన్ సైంటిఫిక్ అచీవ్‌మెంట్స్

లఘు చిత్రం: పదో తరగతి నుంచి మొదటి రెండు స్థానాలు సాధించిన ఇద్దరు విద్యార్థులు మాత్రమే అర్హులు.

నిడివి: రెండు నిమిషాలు

పాఠశాల, జిల్లా స్థాయి పరీక్షలకు సిలబస్ (పదోతరగతి గణితం, విజ్ఞానశాస్త్రం (పీఎస్ అండ్ ఎన్ఎస్) సాంఘికశాస్త్రం (జియోగ్రఫీ అండ్ భారత్‌దర్శన్) విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి (బహుళైచ్ఛిక ప్రశ్నలు)

రాష్ట్ర స్థాయిలో: సులభ సూత్రాలను ఉపయోగించి రూట్ 2 విలువ కనుగొనుట (లేదా) 17వ శతాబ్దానికి పూర్వం భారతీయ శాస్త్రజ్ఞుల పరిశోధనలు (బహుళైచ్ఛిక ప్రశ్నలు)

రిజిస్ట్రేషన్ గడువు తేదీ: నవంబర్ 20

విద్యార్థులు పోటీపడాలి



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కౌశల్-2024 పోటీల్లో విరివిగా పాల్గొనాలి. ఇందుకు పాఠశాలల్లోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. విజేతలుగా నిలిచి జిల్లాకు పేరు తీసుకురావాలి.

–మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్సు అధికారి

సీమ దాటిన సీతాఫలం

- గుర్రంకొండ ఫలాలకు భలే డిమాండ్
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- కూలీలకు జీవనోపాధి



కేరళతో పాటు బయట రాష్ట్రాలకు ఎగుమతి చేయడానికి సీతాఫలాలను సిద్ధం చేసిన వ్యాపారులు

గుర్రంకొండ: గుర్రంకొండ సీతాఫలాలంటే ప్రస్తుతం ఎంతో క్రేజ్. వాటి రుచి మన రాష్ట్రాన్ని దాటి ఇతర రాష్ట్రవాసులను సైతం నోరూరిస్తోంది. దీంతో ఈ ఫలాలకు ఎంతో డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా కూలీలకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఈ నేపథ్యంలోనే మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సీతాఫలాలను ఎగుమతి పెరిగింది.

వేలాది మందికి..



పేదవాడి ఆపిల్‌గా పేరుపొందిన సీతాఫలాల సేకరణ ఎందరో కూలీలకు జీవనోపాధి కలిప్తోంది. ప్రస్తుతం ఆర్థికంగా వారిని ఆదుకొంటోంది. అన్నమయ్య జిల్లాలో.. ముఖ్యంగా పడమటి ప్రాంతమైన పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది కూలీలకు సీతాఫలాల సేకరణ ఆర్థిక వనరుగా మారింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో చాలా మంది సీతాఫలాలను సేకరించి జీవనం సాగిస్తుంటారు. ఆయా గ్రామాలకు సమీపంలోని కొండలు, గుట్టల్లో రోజంతా గాలించి సీతాఫలాలను కూలీలు సేకరిస్తుంటారు. పలువురు కూలీలు బృందంగా ఏర్పడి రెండు రోజుల పాటు సీతాఫలాలు సేకరించి ఆటోలలో టమాటా క్రేట్ల ద్వారా తరలిస్తారు. నిత్యం గుర్రంకొండ, కంద్రిగలోని మండీలకు సీతాఫలాలను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సకాలంలో తేలిక పాటి వర్షాలు కురవడంతో సీతాఫలాల దిగుబడి బాగుంది.

రోజుకు రూ.600 మేర ఆదాయం

సీతాఫలాల సేకరణతో కూలీలకు రోజుకు రూ.600 మేరకు ఆదాయం సమకూరుతోంది. కూలీలు రోజుకు కనీసం రెండు క్రేట్‌ల సీతాఫలాలు సేకరిస్తుంటారు. ఒక్కో బుట్ట(క్రేట్) రూ. 200 నుంచి రూ. 300 వరకు విక్రయిస్తుంటారు. దీంతో సగటున ఒక్కో కూలీ రూ.600 మేరకు సంపాదించుకొంటారు.

వివిధ రాష్ట్రాలకు ఎగుమతి

గుర్రంకొండ, కంద్రిగ గ్రామాల నుంచి సీతాఫలాలు కేరళ తో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వాహనాలను ఇక్కడికి తీసుకొచ్చి మండీలలో వ్యాపారుల దగ్గర సీతాఫలాలను కొనుగోలు చేసి వారి రాష్ట్రాలకు తరలిస్తున్నారు. మండీలలో ఒక్కో క్రేట్ రూ. 400 నుంచి రూ.450 వరకు చెల్లించి బయట రాష్ట్రాల వ్యాపారులు సీతాఫలాలను తమ రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ సీతాఫలాలకు మంచి డిమాండ్ ఉండటంతో ఒక్కో క్రేట్ రూ.600 నుంచి రూ.700 వరకు ధరలు పలుకుతుంటాయి.

రాష్ట్రంలో భలే డిమాండ్

బయట రాష్ట్రాల్లోనే కాకుండా మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గుర్రంకొండ సీతాఫలాలకు మంచి డిమాండ్ ఉంది. కూలీల దగ్గర కొనుగోలు చేసిన సీతాఫలాలను స్థానిక వ్యాపారస్తులు బయట రాష్ట్రాలతో పాటు విజయవాడ, గుంటూరు, కనిగిరి, నెల్లూరు, ఉదయగిరి, దర్శి, మార్కాపురం, నరసరావుపేట వంటి పట్టణాలకు ఎగుమతి చేస్తుంటారు. దీంతో అక్కడి వ్యాపారులు కూడా గుర్రంకొండకు వచ్చి సీతాఫలాలను వాహనాల్లో తీసుకెళుతున్నారు. ముఖ్యంగా కంద్రిగలో పెట్రోలు బంకులు, డాబాలు, చిల్లర దుకాణాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. రాత్రిళ్లు ఆర్టీసీ బస్సులన్నీ ఇక్కడ నిలిపి డాబాల్లో భోజనాలు చేస్తుంటారు. బెంగుళూరు నుంచి కడప, ప్రొద్దుటూరు, కావలి, కనిగిరి, ఉదయగిరి, ఆత్మకూరు, దర్శి, మార్కాపురం, చీరాల, పొదిలి, గిద్దలూరు, రాజంపేటతో పాటు మరిన్ని బస్సు సర్వీసులు రాత్రివేళల్లో ఇక్కడ నిలుపుతుంటారు. దీంతో ప్రయాణికులు కూడా ఇక్కడి సీతాఫలాలను ఇష్టపడి మరీ తీసుకెళుతుంటారు.

గ్రేడ్‌ను బట్టి ధరలు



కంద్రిగకు సీతాఫలాలను తీసుకొచ్చిన కూలీలు

కూలీల దగ్గర కొనుగోలు చేసిన సీతాఫలాలను మండీల వ్యాపారులు గ్రేడ్‌ల వారీగా విభజిస్తారు. ప్రతి క్రేట్, బుట్టలోని సీతాఫలాలను ఏ, బీ, సీ అంటూ మూడు గ్రేడ్‌లుగా వేరు చేస్తారు. వాటిని బట్టి రేట్‌లు నిర్ణయిస్తారు. వంద సీతాఫలాలు ఏ గ్రేడ్ రూ.900, బీ గ్రేడ్ రూ.650, సీ గ్రేడ్ రూ.400 వరకు విక్రయిస్తుంటారు. బయట రాష్ట్రాలకు మాత్రం ఏ, బీ గ్రేడ్ సీతాఫలాలనే ఎగుమతి చేస్తారు.

మూడు నెలలు జీవనోపాధి



సీతాఫలాల సేకరణతో మూడు నెలల పాటు మాకు జీవనోపాధి లభిస్తుంది. గత ఏడాదితో పోలిస్తే ఇపుడు సీతాఫలాల దిగుబడి ఆశాజనకంగా ఉంది. పొలాల గట్లు, కొండలు, గుట్టల్లో గాలించి మరీ సీతాఫలాలను సేకరిస్తాము. ఒక రోజంతా సేకరణకే పడుతుంది. మరుసటిరోజు వాటిని గుర్రంకొండ, కంద్రిగ గ్రామాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటాము.

– లక్ష్మీదేవి, ఎగువబోయపల్లె

రోజుకు రెండు బుట్టల సేకరణ



ఈ సీజన్‌లో సగటున రోజుకు రెండుబుట్టల సీతాఫలాలను సేకరిస్తుంటాము. కాయల నాణ్యతను బట్టి ఒక బుట్ట కాయలు రూ. 250 నుంచి రూ.300 వరకు కొనుగోలు చేస్తారు. రోజుకు రూ. 600 వరకు సంపాదిస్తుంటాం. మూడునెలల పాటు సీతాఫలాల సేకరణతో మా జీవనం గడుస్తుంది. ఈ ఏడాది దిగుబడి, ధరలు బాగున్నాయి.

– రామాంజులు, బురుజుపాళెం

క్లుప్తంగా

తండ్రీ, కొడుకులపై దాడి


గాయపడిన భాస్కర్

బి.కొత్తకోట : తమ పొలాన్ని ఆక్రమిస్తుండగా అడ్డుకున్న రైతులపై దాడి చేసిన ఘటన ఆదివారం మండలంలోని కాండ్లమడుగు వద్ద జరిగింది. బాధితుల కథనం మేరకు.. కాండ్లమడుగుకు చెందిన రామచంద్రకు భూమి ఉంది. తమకు చెందిన భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నం చేయగా రామచంద్ర, అతడి కుమారులు భాస్కర్, వేణు, ఇతర కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఆక్రమణకు ప్రయత్నించిన వారి వర్గీయులు వారిపై దాడి చేశారు. రామచంద్ర, భాస్కర్, వేణులు గాయాలవడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై పోలీసులు బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

108 వాహనంలో ప్రసవం


108 వాహనంలో మగ బిడ్డకు జన్మనిచ్చిన షేక్ రజియాబేగం

సిద్దవటం : పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళకు 108 అంబులెన్స్‌లోనే ఈఎంటీ వరలక్ష్మి, ఆశా వర్కర్ హిమాంబీ ప్రసవం చేసి తల్లీ, బిడ్డల ప్రాణాలు కాపాడారు. మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ రజియాబేగం ఆదివారం తెల్లవారు జామున పురిటి నొప్పులు రావడంతో ఆస్పత్రికి వెళ్లేందుకు 108 వాహనానికి ఫోన్ చేశారు. ఆశా వర్కర్ హిమాంబీతో కలిసి సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుండగా మార్గ మధ్యంలోని పెన్నానది వంతెన సమీపంలో రజియాబేగానికి నొప్పులు ఎక్కువయ్యాయి. 108 వాహనం నిలిపి ఈఎంటీ వరలక్ష్మి, ఆశా వర్కర్ హిమాంబీ అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. రజియాబేగంకు ఇది ఆరోకాన్పు కాగా మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీ, బిడ్డలు సిద్దవటం ఆసుపత్రిలో ఆరోగ్యంగా ఉన్నారని వారు తెలిపారు.

పాఠశాలల సమయం మార్చవద్దు


కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల సమయం మార్చాలనే నిర్ణయం సరికాదని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసీపీ.గురువారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బడికి రావడం పిల్లలకు అలవాటుగా మారిందన్నారు. ఇపుడు సాయంత్రం ఐదు గంటల వరకు మారిస్తే ఇబ్బంది పడతారన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఐదు నుంచి 8 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలకు వస్తున్నారని, వారు ఇళ్లకు వెళ్లాలంటే ఇబ్బంది పడతారన్నారు.

యువకుడిపై దాడి

కడప అర్బన్ : నగరంలోని చిలకలబావి వద్ద జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. నగరానికి చెందిన అతహర్‌తో స్థానికుడు రియాజ్‌కు మనస్పర్థలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం చిలకలబావి వద్ద అతహర్‌పై రియాజ్, తదితరులు దాడిచేసి గాయపరిచారు. బాధితుడిని రిమ్స్‌కు తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చలి కాలం.. జరభద్రం

చలి.. తన పంజా విసురుతోంది. వేకువజాము మొదలు దట్టమైన పొగమంచు కమ్ముతోంది. స్వెటర్లు వేసుకున్నా.. మంకీ క్యాపు పెట్టుకున్నా.. మఫ్లర్లు కట్టుకున్నా.. గజగజ వణకాల్సిందే. అన్నమయ్య జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.1 డిగ్రీలకు చేరింది. ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, పనులకు వెళ్లే జనంతోపాటు వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.


రాజంపేటలో దట్టమైన మంచు

- జిల్లాలో 18.1 ఉష్ణోగ్రతల నమోదు
- ఆరోగ్య జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు
- పరిశుభ్రత పాటిస్తే జ్వరాలు దూరం

రాజంపేట టౌన్ : చలికాలం వచ్చేసింది. వాతావరణంలో సంభవించిన పెను మార్పుల కారణంగా పగటి ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 18.1 డిగ్రీలు కాగా, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27 డిగ్రీల సెల్సియస్ దాటడం లేదు. రాజంపేట పట్టణంతోపాటు, జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిత్యం మంచు కురుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అనేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పని సరి

చల్లని గాలులు వీస్తుండడంతో ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసి ఉంటుంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, కూలీలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయాన్నే వాకింగ్, జాగింగ్ చేసే వారు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోకుంటే జబ్బుల బారిన పడాల్సి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆస్మా జబ్బు ఉన్న వారు శీతాకాలంలో వాకింగ్‌కు వెళ్లకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. చలితీవ్రత పెరిగే కొద్ది శ్వాస కోస వ్యాధులు ప్రబలే ప్రమాదన్నందున ఉదయాన్నే బయటకు వెళ్లకపోవడమే ఉత్తమమని, వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో, పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్యం. దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. దోమ కుడితే టైఫాయిడ్, డెంగీ, చికెన్ గన్యా, మెదడువాపు, విష జ్వరాలు వచ్చే అవకాశాలుంటాయి. తాగునీటి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరమని, వేడి వేడి ఆహార పదార్థాలనే తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. వంట పాత్రలపై విధిగా మూతలు పెట్టాలని, దోమ తెరలు వాడాలని హెచ్చరిస్తున్నారు.

ఉన్ని దుస్తులను ధరించాలి

చలి పెరగడంతో శీతాకాలం దుస్తులు విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేస్తారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడేవారు, జ్వరం, దగ్గు సమస్య లున్నవారు వెచ్చని వాతావరణంలో ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు, చిన్నారులతోపాటు అన్ని వయస్కుల వారు.. తమకు అనుగుణంగా స్వెటర్లు, జర్కిన్, మంకీ టోపీలు ధరించడం మేలు. శీతలపానీయాలకు, ఐస్‌క్రీంలకు దూరంగా ఉంటూ.. బయటికి వెళ్లినపుడు చెవుల్లోకి దూది పెట్టుకుని వెళ్లడం మంచిదని చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవు



చలి కాలంలో ప్రతి ఒక్కరూ విధిగా తగు జాగ్రత్తలు పాటించాలి. శీతాకాలంలో ముఖ్యంగా జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాపించే ప్రమాదముంది. జాగ్రత్తలు పాటించకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవు. అందువల్ల ప్రతి ఒక్కరు శీతాకాలం ముగిసే వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ పీవీ.నాగ్వేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులకు నష్టం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాయచోటి అర్బన్ : విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులకు నష్టం కలుగుతోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి ప్రసాద్, జాబీర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల నిర్ణయాలు హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ తరగతులు ఉంటాయని కొద్ది రోజుల కిందట ప్రకటించి, తిరిగి రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేయడం దారుణమన్నారు. ఇటీవల శిబిరంలో ఒక హెచ్‌ఎం మృతి చెందినప్పటికీ అధికారులతీరులో మార్పురాకపోవడం తగదన్నారు. రెండు నెలల కిందట ఉపాధ్యాయుల పనిసర్దుబాటు ప్రక్రియను గందరగోళంగా పూర్తిచేసి, నేడు మళ్లీ రెండో విడతగా పనిసర్దుబాటు చేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు వింత నిర్ణయాల అమలుక స్వస్తి పలకాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, సి.వి.రమణమూర్తి, దావుద్దీన్, సురేంద్రరెడ్డి, ప్రసాద్, చంద్రశేఖర్, రమేష్, హాఫీజుల్లా, వెంకటరమణ, శామ్యూల్, కిఫాయత్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ

పులివెందుల టౌన్ : తమ కుమార్తె ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే తల్లిదండ్రుల కల.. అది తమ పిల్లలు ఉన్నత స్థాయికి చేరినపుడే సాధ్యమవుతుంది. ఇది గట్టిగా నమ్మిన సాయిరెడ్డి రాఘవి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయలేదు. రేయింబవళ్లు కష్టపడి చదివి ఎయిమ్స్ పరీక్షలు రాసి జాతీయ స్థాయిలో 220వ ర్యాంకు సాధించి వావ్ అనిపించింది. పులివెందుల పట్టణంలోని లక్ష్మీ హాల్ సమీపంలో నివాసముంటున్న గవిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సుగుణమ్మల దంపతులకు సాయి రాఘవి, సాయి శివాణీ కుమార్తెలు. తొలి సంతానమైన సాయి రాఘవి చదువులో రాణిస్తుండడంతో ఎలాగైనా ఉన్నత స్థాయిలో చూడాలని తల్లిదండ్రులు తపించారు. కిరాణాకొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నప్పటికీ చంద్రశేఖర్‌రెడ్డి వారిని ఉన్నతంగా చదివించాలని కష్టపడ్డారు. తల్లిదండ్రుల కష్టం చూసిన సాయిరాఘవి తన మెదడుకు పదును పెట్టింది. రేయింబవళ్లు చదువుతూ ఎయిమ్స్ పరీక్షలకు సిద్ధమైంది. హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో చదువుతూ ఎయిమ్స్ ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో 220వ ర్యాంకు సాధించి వావ్ అనిపించింది. బాగా చదివి పేదలకు వైద్య సేవలందిస్తానని సాయిరాఘవి పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకు రావడంతో తల్లిదండ్రులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడప విద్యార్థికి 102వ ర్యాంకు

కడప ఎడ్యుకేషన్: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సు(ఎయిమ్స్) జాతీయ స్థాయి పీజీ అర్హత పరీక్షలో కడప విద్యార్థి ప్రతిభ చాటారు. జాతీయ స్థాయిలో 102వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. కడప పరిధిలోని ఎర్రముక్కపల్లెలో నివాసముంటున్న డైట్ ప్రిన్సిపల్ కె.రాజేంద్ర ప్రసాద్, అట్లూరు జెడ్పీ హైస్కూల్‌లో పాధ్యాయులురాలిగా పనిచేస్తున్న వరలక్ష్మి దంపతుల కుమారుడు కె.మోహిత్ మెడికల్ పీజీ ఎంట్రెన్స్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 102వ ర్యాంకు సాధించాడు. దీంతో తల్లి తండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని.. డ్రైవర్ మృతి

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని బొల్లవరంలో ప్రమాదవశాత్తూ విద్యుత్తు స్తంభాన్ని ఆటో ఢీకొనడంతో డ్రైవర్ గొల్ల శ్రీనివాసులు(34) మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసుల వివరాల మేరకు.. జమ్మలమడుగులోని భాగ్యనగరం కాలనీకి చెందిన శ్రీనివాసులు, తన భార్య సువర్ణతో కలిసి ఆటోలో తిరుగుతూ ముగ్గ పిండి వ్యాపారం చేస్తున్నారు. ఇతడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రొద్దుటూరులోని హనుమాన్‌నగర్‌లో సమీప బంధువు దినఖర్మ నిమిత్తం శనివారం రాత్రి తన ఆటో తీసుకొని శ్రీనివాసులు వచ్చాడు. ఆదివారం ఉదయం ఆటోలో జమ్మలమడుగుకు బయలుదేరాడు. బొల్లవరంలోకి రాగానే ఎదురుగా గేదె అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో గాయపడిన అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపాడు. మృతుడి సోదరుడు వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మయ్య తెలిపారు.

ఏడు గంటలకే మద్యం విక్రయం

చాపాడు : ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ మండలంలోని నక్కలదిన్నెలో ఉదయం ఏడు గంటలకే మద్యం దుకాణం తెరచి జోరుగా విక్రయిస్తున్నారు. గత నెల 16న నక్కలదిన్నెలో 83వ దుకాణం ఏర్పాటైంది. మూత పడిన మరో రైస్‌మిల్ వద్ద 84వ దుకాణం ఏర్పాటైంది. అయితే రెండు వారాల కిందట నక్కలదిన్నె రోడ్డులోనే రెండు దుకాణాలు నిర్వహించడం ప్రారంభించారు. అంతే గాక.. ఉదయం 7-8 గంటల మధ్య దుకాణం తెరచి విక్రయిస్తున్నారు. ఉదయమే తెరవడంతో జనాలు మద్యం దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి వివరణ కోరగా.. మద్యం దుకాణం ఉదయమే తెరచుకోవడంపై విచారించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

గుర్రంకొండ ఏఎస్ఐపై కేసు నమోదు

మదనపల్లె : గుర్రంకొండ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న మోజెస్(56)పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఏఎస్ఐ మోజెస్ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ తనను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆయన భార్య ఎస్తర్‌రాణి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై..

మదనపల్లె : యువతి అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఇందిరా నగర్‌కు చెందిన ఓ యువతి(23) జ్వరంగా ఉందంటూ తల్లిని వెంట పెట్టుకుని శనివారం సాయంత్రం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ తనకు నీళ్లు దప్పికగా ఉందని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. యువతి తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం రాత్రి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపులపై..

మదనపల్లె : వరకట్న వేధింపులపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని కొండామారిపల్లె పంచాయతీ సత్యసాయి కాలనీకి చెందిన కే.మహేశ్వరి(23), అదే కాలనీకి చెందిన మారెప్ప కుమారుడు పి.నరసింహులును ప్రేమించి 2019లో వివాహం చేసుకుంది. మూడేళ్ల తర్వాత నరసింహులు తన భార్య మహేశ్వరిని వేధించడం, దురలవాట్లకు లోను కావడంతో ఆమె భరించలేక ఆదివారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఆ మేరకు భర్త నరసింహులు, అత్త అంజమ్మపై కేసు నమోదుచేశారు.

రవీంద్రనగర్‌లో..

మండలంలోని ఎగువకురవంక రవీంద్రనగర్‌కు చెందిన షేక్‌జాఫర్‌వలీ కుమార్తె షేక్ కామ్యభాను(26) అదే కాలనీలో ఉండే షామీర్ కుమారుడు షఫీతో 2021లో వివాహమైంది. వీరికి 18 నెలల పాప ఉంది. అయితే ఇటీవల కొంతకాలం నుంచి షామీర్, ఆయన కుటుంబ సభ్యులు కామ్యభానును వేధిస్తుండడంతో ఆమె ఆదివారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. భర్త షామీర్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భార్యను వదలి వెళ్తూ యువకుడు దుర్మరణం


అజయ్ (ఫైల్)


విలపిస్తున్న కుటుంబీకులు

బి.కొత్తకోట: భార్యను పుట్టింటిలో వదిలిన భర్త తిరిగి ఇంటికి వెళ్తూ ప్రమాదానికి గురైన సంఘటన ఆదివారం రాత్రి బి.కొత్తకోట సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..మండలంలోని నాయనబావి పంచాయతీ ఆకులవారిపల్లెకు చెందిన ఆర్.అజయ్ (24)కు సత్యసాయి జిల్లా బాలసంద్రానికి చెందిన శ్రావణితో రెండేళ్ల కిందట వివాహమైంది. ఆదివారం బైక్‌లో బాలసంద్రానికి వెళ్లి భార్య శ్రావణిని పుట్టింటిలో వదిలిపెట్టాడు. తిరిగి స్వగ్రామం ఆకులవారిపల్లెకు వెళ్లేందుకు బి.కొత్తకోట మీదుగా వస్తుండగా.. కస్తూర్బా బాలికల విద్యాలయం సమీపంలోని మర్రిమాను వద్ద బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. అజయ్‌కు తీవ్ర గాయాలవడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుడు అంగళ్లులోని ఓ ప్రైవేట్ కళాశాలలో సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. అజయ్ మృతి విషయం తెలుసుకుని ఆస్పత్రికి చేరుకున్న కుటుంబీకులు గుండెలవిసెలా విలపిస్తుండటం స్థానికులను కలచివేసింది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లెకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉన్నంతలో తృప్తిపడేవారే నిజమైన ఐశ్వర్యవంతులు

అంతర్జాతీయ పరిచారకులు స్టీఫెన్ చిన్నప్ప


అంగళ్లు సీయోను ప్రార్థనా మందిరంలో బోధిస్తున్న స్టీఫెన్ చిన్నప్ప

కురబలకోట : దేవునికి ప్రథమ స్థానం ఇచ్చేవారు ఆనందాన్ని ఉంటారని, ఉన్నంతలో తృప్తి పడేవారే నిజమైన ఐశ్వర్యవంతులని అంతర్జాతీయ సువార్త పరిచారకులు స్టీఫెన్ చిన్నప్ప పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు సీయోను ప్రార్థనా మందిరంలో జరిగిన ఆరాధన, బల్ల వర్తమానం కార్యక్రమంలో ఆయన వాక్యోపదేశం చేశారు. క్రైస్తవులు శాంతియుత జీవనం అవలంబించాలని, ప్రతి ఒక్కరూ వాక్యాన్ని ధ్యానించడంతోపాటు అనుసరించాలన్నారు. ప్రతీకారం మనిషిని బంధిస్తే క్షమాపణ విడుదల ఇస్తుందన్నారు. దేవుని కన్నా మరీ ఎక్కువగా దేనిని ప్రేమించినా.. అది పాపంగానే పరిగణించవచ్చన్నారు. పరోపకారం మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పాస్టర్ విక్టర్ వేదనాయక్, నాతానురెడ్డి, శామ్యుయేల్, జయరాజ్‌రెడ్డి, భాస్కర్, తియోతి, నెహెమ్యా, జాన్, డోర్కా తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


కదిరాయచెరువులో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి/కలకడ : కూటమి ప్రభుత్వం ఐదు నెలల వ్యవధిలోనే అన్ని విధాలా విఫలమైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కలకడ, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన ఆదివారం స్థానిక నాయకులు, కార్యకర్తలను కలుసుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పేరుతో గద్దెనెక్కిన ప్రభుత్వం వాటిని విస్మరించి అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. హామీలపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని.. రోజుకో అసత్య ప్రచారంతో కాలం వెళ్లదీస్తోందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలో తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

శ్మశాన వాటిక ప్రహరీ కూల్చివేత

అడ్డదారిలో నకిలీ పత్రాలు సృష్టించి


శ్మశాన ప్రహరీగోడను కూల్చివేసిన దృశ్యం

పుల్లంపేట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వారు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంది. పుల్లంపేట మండల వ్యాప్తంగా యథేచ్ఛగా భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. శ్మశాన వాటిక పక్కనే తమ భూమి ఉండటంతో కొందరు నాయకులు అడ్డదారిలో నకిలీ పత్రాలు సృష్టించారు. శ్మశాన వాటికనే కబ్జా చేసేందుకు ప్రహరీ గోడను రాత్రికి రాత్రి జేసీబీతో శనివారం కూల్చి వేశారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముద్దా బాబుల్ రెడ్డి సహకారంతో రూ.5 లక్షల నిధులు వెచ్చించి ఈ ప్రహరీ నిర్మించారు. సంఘటనా స్థలాన్ని సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దారు అరవింద కిషోర్, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ పరిశీలించారు.

'యువ ఉత్సవ్' విజేతలకు బహుమతుల ప్రదానం

విభాగం	ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు
పెయింటింగ్	దేవదాస్, ముత్యం, పునీత్
కవిత్వం	పూజితరెడ్డి, శివనాగేశ్వరి, అంజలిదేవి
మొబైల్ ఫొటోగ్రఫీ	మనోజ్, రషీద్, సైఫ్
డిక్లేమసిన్ విభాగం	శ్రీహర్షిత, మహమ్మద్ కౌసర్, నారాయణ
సైన్స్‌ఎగ్జిబిషన్ మేళా	హేమంత్‌కుమార్ టీం, మహమ్మద్ కైఫ్ టీం, మహేష్‌వర్ధన్ టీం


విజేతలతో వైవీయూ అధికారులు

వైవీయూ : యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా యోగి వేమన విశ్వ విద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచిన విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానం చేశారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పలు అంశాలపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. కల్చరల్‌ఫెస్టివల్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో ప్రొద్దుటూరు నటరాజ కళా క్షేత్రం నుంచి మిత్రవింద టీం ప్రథమ, ట్రిపుల్ ఐటీ ఇండియన్ ఆర్ట్ అకాడమీ ద్వితీయ, కర్రసాము కత్తి సాము జయచంద్ర టీం తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీటితోపాటు మిగిలిన పోటీల్లోనూ గెలిచిన విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోతోపాటు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌ను వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు జాతీయ వేదికలపై సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే యువ అధికారి మణికంఠ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.వెంకట్రామిరెడ్డి, ఆచార్య జి.విజయభారతి, న్యాయ నిర్ణేతలు, తదితరులు పాల్గొన్నారు.

బోటింగ్ వేళ.. భద్రత డొల్ల


గేట్ల వద్ద దెబ్బతిన్న గోడ


రాళ్లు చెదిరి.. ప్రమాదంగా..

- మైలవరం జలాశయంలో 6.3 టీఎంసీల నీరు
- కరకట్ట, గేట్ల వద్ద ప్రహరీ లేక పొంచి ఉన్న ప్రమాదం
- పర్యాటకుల భద్రత పట్టని అధికారులు

జమ్మలమడుగు : పర్యాటకులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. వారి భద్రతను గాలికి వదిలేయడంతో..ఏ మాత్రం అజాగ్రత్తగా నడిచినా.. ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితి కలుగుతోంది. చారిత్రాత్మకమైన గండికోట విశిష్ఠత తిలకించేందుకు నిత్యం పర్యాటకులు వస్తుంటారు. సమీపంలోనే మైలవరం జలాశయంలో బోటింగ్ సౌకర్యం ఉండడంతో అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. మైలవరం జలాశయం నిండా నీరు చేరడంతో సందర్శకులు వీక్షించేదుకు తరలివస్తున్నారు. అయితే కరకట్టల వద్ద ప్రహరీ లేకపోవడంతో ఏం జరుగుతుందోనని కంగారు పడుతున్నారు.

ప్రహరీ కూలినా.. పట్టక..

మైలవరం జలాశయం వీక్షణకు వచ్చిన పర్యాటకుల భద్రతతో డొల్లతనం కనిపిస్తోంది. తాజాగా కురిసిన వర్షాలకు జలాశయంలో 6.3 టీఎంసీల నీరు చేరింది. దీనికి చూసేందుకు వచ్చే జలాశయం కరకట్ట రోడ్డుకు ఇరువైపులా ప్రహరీ పూర్తిగా దెబ్బతింది. వాహనాల్లో వచ్చే పర్యాటకులు ఏమాత్రం అజాగ్రత్తగా నడిపినా, ఎదురుగా వాహనాలు వచ్చినా జలాశయంలో పడి ప్రాణాలు కోల్పోవాల్సి పరిస్థితి. జలాశయం గేట్ల వద్ద కూడా రక్షణ గోడ లేకపోవడంతో ఆత్మహత్య చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా పెరిగిపోతోంది. ఇటీవల దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన ఓ మహిళ, తన పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవటానికి గేట్ల వద్దకు రాగా స్థానికులు గుర్తించి కాపాడారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని జలాశయం వద్ద పర్యాటకులకు భద్రత ఉండేలా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

పర్యాటకులకు ప్రమాదకరంగా ఉంది



మైలవరం జలావయం.. పర్యాటకులకు ప్రమాదకరంగా మారింది. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చాం. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీరు ఉంది. ఏ చిన్న ప్రమాదం జరిగినా సందర్శకుల ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. రాత్రివేళ వాచ్‌మెన్ ఉండడం లేదు.

- శివకుమార్, డీవైఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి, జమ్మలమడుగు

రూ.42 లక్షల నిధులు మంజూరు..

మైలవరం ప్రాజెక్టు ప్రహరీ పూర్తిగా దెబ్బతింది. వాటి మరమ్మతులకు రూ.42 లక్షల నిధులు కావాలని ప్రతిపాదనలు పంపాం. టెండర్ దశ పూర్తయింది. త్వరలో పనులు చేపట్టి మైలవరం జలాశయం కరకట్టల వద్ద, గేట్ల వద్ద ప్రహరీ నిర్మించి భద్రత కల్పిస్తాం.

- ఆనంద నరసింహమూర్తి, డీఈఈ, మైలవరం జలాశయం